మరుపాక స్కూలు 'ఆదర్శం'

- త్రిపుల్ ఐటీకి తొలి విడత ఐదుగురు
- రెండో విడతలో నలుగురు ఎంపిక
- వరుసగా ఘనత నిలబెట్టుకుంటున్న వైనం


మరుపాక మోడల్ స్కూల్

రావికమతం: మరుపాక మోడల్ స్కూల్ ఆదర్శం గా నిలుస్తోంది. ఉత్తమ బోధన, క్రమ శిక్షణకు మారుపేరుగా నిలిచిన ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. వరుసగా త్రిపుల్ ఐటీతోపాటు నవోదయకు ఎంపికవుతున్నారు. ఈ ఏడాది ఏకంగా 9 మంది విద్యార్థులు వివిధ త్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించి ఆశ్చర్యపరిచారు. పాఠశాల విద్యార్థులు ద్వారపూడి తరుణ్‌కుమార్, తూరుబిల్లి హరిత, సాసుబిల్లి స్వర్ణకుమారి, దుడ్డి యశ్వంత్, కాశెట్టి హేమసాగర్ ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ద్వారపూడి తరుణ్‌కుమార్ (578), తూరుబిల్లి హరిత(575), సాసుబిల్లి స్వర్ణకుమారి(566), దుడ్డి యశ్వంత్(567), కాశెట్టి హేమసాగర్565) శ్రీకాకుళం త్రిపుల్ ఐటీకి మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఎంపికయ్యారు. డి.తేజశ్రీ, జి.జోత్స్న, వి.పావని రెండో విడత కౌన్సెలింగ్‌లో నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు త్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ సత్యసునీల్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రావి గోవిందరావు సోమవారం అభినందించారు.

ఆరేళ్లుగా రెట్టింపు ఫలితాలు...

మరుపాక మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో ఆరేళ్లుగా రెట్టింపు ఫలితాలు వస్తున్నాయి. 2015 నుంచి శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. 2015 నుంచి ఏటా ఇద్దరు, ముగ్గురు చొప్పున, 2017లో నలుగురు పదికి పది పాయింట్లు సాధించగా, 2018లో ఏకంగా 14 మందికి పదికి పది పాయింట్లు లభించాయి. జిల్లాకే ఆదర్శంగా ఫలితాలు నిలిచాయి. ఈ ఏడాది పది మందికి మంచి మార్కులు రాగా, వారిలో 9 మంది ఏకంగా త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

వివిధ పోటీల్లో ప్రతిభ

చదువుతోపాటు స్కూల్ విద్యార్థులు పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిస్తున్నారు. రెండేళ్ల క్రితం విజయవాడ, విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీల్లో స్కూల్ బాలికలు గూడూరి లక్ష్మి అరవింద, జయమంజూష ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి ఆదర్శంగా నిలిచారు.


తరుణ్‌కుమార్


హరిత


స్వర్ణకుమారి


యశ్వంత్


హేమసాగర్


స్మృతి


తేజశ్రీ


పావని


జోత్స్న

క్లుప్తంగా

వలంటీర్ల పాత్ర కీలకం


వలంటీర్లను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

మాకవరపాలెం: సంక్షేమ పథకాల పంపిణీలో వలంటీర్లు కీలక ప్రాత పోషిస్తున్నారని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, సర్పంచ్ గొంతిన చెల్లారత్నం అన్నారు. తామరం సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మంది వలంటీర్లను ఘనంగా సత్కరించి సేవామిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘ మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, కార్యదర్శి బాలదొర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీమాస్త్రంతో రసంపీల్చే పురుగుల నివారణ


నారుమడులకు నీమాస్త్రం పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

మాకవరపాలెం: వరి నారుమడులకు ప్రకృతి సేద్య పద్ధతిలో నీమాస్త్రం పిచికారీ చేయడం ద్వారా రసం పీల్చే పురుగులను నివారించవచ్చని ప్రకృతి సేద్య విభాగం సిబ్బంది కవిత, సుదర్శన్ తెలిపారు. నారాయణరాజుపేటలో నారుమడులకు రైతులతో నీమాస్త్రం పిచికారీ చేయించారు. ఇలా చేయడం వల్ల పురుగుల గుడ్లు, రసం పీల్చే పురుగులను నాశనం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అప్పారావు, లోవకుమార్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై సర్పంచ్ ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రమణ

నాతవరం: జిల్లేడుపూడి పంచాయతీలో ప్రభుత్వ చెరువును ఆక్రమించుకొని జీడి మొక్కలు వేస్తున్నారని సర్పంచ్ లాలం రమణ సోమవారం తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. వెంటనే చెరువును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. మరెవ్వరూ ఆక్రమించకుండా చర్యలు చేపట్టాలన్నారు.

స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందనలో వచ్చిన అర్జీలను వెను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డివిజన్‌లోని మండలాల నుంచి భూ సమస్యలు, పింఛన్లు, సదరం సర్టిఫికెట్లు తదితర సమస్యలపై ఈ వారం 12 అర్జీలు వచ్చాయి. స్పందన ఫిర్యాదుకు లిఖిత పూర్వకంగా అర్జీదారుడికి సమాధానం ఇవ్వాలని ఆర్డీవో తెలిపారు. స్పందన వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని నిరసన

కె.కోటపాడు: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలను మంజూరు చేయాలని సీపీఎం నాయకుడు యర్రా దేముడు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. వర్షాకాలంలో రెయిన్ కోట్లు, బూట్లు, సబ్బులు ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది సూరిదేముడు, చెల్లయ్యమ్మ, ఈశ్వరమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ పైపులైన్ మార్గంలో చెట్లు తొలగించాలి

తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు


ఓటరు సర్వేపై సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: మండలంలో హెచ్‌పీసీఎల్ పైపులైను ఏర్పాటు చేసిన ప్రదేశంలో చెట్లను వెంటనే తొలగించాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు ఆదేశించారు. ఆయన సోమవారం ఎం.బి.పట్నంలో 104, 109 పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే చేసేటప్పుడు వలంటీర్లను, రాజకీయ పార్టీ నాయకులను వెంట తీసుకెళ్లొద్దని బీఎల్వోలకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ నాతవరం మండలంలో 30 కిలోమీటర్లపైగా హెచ్‌పీసీఎల్ పైపులైను ఏర్పాటు చేశారన్నారు. దీనికి పైభాగంలో భారీ వృక్షాలు తొలగించాలని ఎం.బి.పట్నం, జిల్లేడుపూడి గ్రామాల రైతులకు నోటీసులు జారీ చేశామన్నారు. వారంతా ఆక్రమిత భూమిలో చెట్లను తొలగించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వ్రజ్రే సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ ఆదేశాలు బేఖాతరు చేయని రైతులపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. భారీ వృక్షాలు, అక్రమ కట్టడాల వల్ల పైపులైనుకు ప్రమాదం జరిగే అవకాశముందన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ బొడ్డపాటి సేవలు మరువలేం

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ


శ్రీరామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షురాలు అనురాధ, తదితరులు

మాడుగుల రూరల్: మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొడ్డపాటి శ్రీరాంమూర్తి సేవలు మరువలేమని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. సోమవారం ఎం. కోటపాడులో శ్రీరాంమూర్తి సంతాప కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శ్రీరాంమూర్తి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ బొడ్డపాటి శ్రీరాంమూర్తి, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, పార్టీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు సుంకర శ్రీనివాసరావు, నేమాల గురువునాయుడు, కొసిరెడ్డి కృష్ణమూర్తి, వడాల అప్పలనాయుడు, కాళ్ల రాము పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం


బయ్యవరంలో చేనేత కార్మికులను సత్కరిస్తున్న ఎంఈవో మూర్తి


చేనేత దుస్తులలో తూటిపాల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: జాతీయ చేనేత దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు చేనేత దుస్తులతో తూటిపాల పాఠశాలకు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరికి చేనేత దుస్తుల ప్రాముఖ్యతపై ఈ సందర్భంగా హెచ్ఎం రాము అవగాహన కల్పించారు. బయ్యవరంలో ఎంఈవో మూర్తి ఉపాధ్యాయులతో కలిసి నేత కార్మికుల ఇళ్లకు వెళ్లి శాలువాలతో సత్కరించారు. చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో చేనేత దినోత్సవం ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బయ్యవరం సర్పంచ్ కాశీవిశ్వనాథ్, హెచ్ఎం అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొండపూడిలో ఎద్దు, ఆవుదూడ మృతి

- సొమ్మసిల్లిన రైతు
- విష ప్రయోగంతో చనిపోయాయని ఫిర్యాదు


మృతి చెందిన దుక్కిటెద్దు వద్ద జనం

రావికమతం: మండలంలోని దొండపూడిలో గుర్తుతెలియని వ్యక్తులు విషప్రయోగం చేయడంతో దుక్కిటెద్దు, ఆవుదూడ సోమవారం మృతి చెందాయి. దీంతో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది. ఇవి కళ్లముందే గిలగిల కొట్టుకుంటూ మృతి చెందడంతో బాధిత రైతు గట్రెడ్డి రాజునాయుడు సొమ్మసిల్లి పడిపోయాడు. అతడు ఇటీవలే రూ.1.10 లక్షలు వెచ్చించి దుక్కిటెడ్లను కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ముమ్మర వ్యవసాయ పనుల్లో ఉన్నాడు. దుక్కిటెడ్లలో ఒక ఎద్దు అనారోగ్యానికి గురైంది. రెండు రోజులుగా వైద్యం చేయిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఎప్పటి మాదిరిగా ఎడ్లకు, దూడకు గోలెంలో దాణా మేపిన కాసేపటికే గిలగిల గింజుకుంటూ క్షణ కాలంలోనే మృతి చెందాయి. దీంతో అతడు రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయాడు. సమీప రైతులు గమనించి సపర్యలు చేశారు. గోలెంను పరిశీలించగా అందులో విషం కలిపినట్టుగా గుర్తించారు. అనారోగ్యానికి గురైన ఎద్దుకు ఆ దాణా మేపకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. మూగజీవులపై ఇంతటి కర్కశమా అంటూ నిట్టూర్చారు. కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

తగ్గిన టమాటా ధర


వారపు సంతలో కొనుగోలుదారులు

కొయ్యూరు: తాళ్లపాలెం వారపు సంతలో టమాటా ధర ఒకేసారి భారీగా తగ్గింది. గత వారం కిలో రూ.200కు విక్రయించగా, ఈ వారం కిలోకి రూ.80 తగ్గి రూ.120కి విక్రయాలు సాగాయి. దీంతో ప్రజలు కాస్త ఊరట చెందారు. వచ్చే వారానికి ధరలు మరింతగా తగ్గే అవకాశాలున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు. చిత్తూరులో టమాటా ఉత్పత్తి క్రమేపీ పెరుగుతుండటంతో ధర తగ్గిందన్నారు. పాదు చిక్కుడు కిలో రూ.150, ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, క్యారెట్, బీట్రూట్, బెండకాయ, కాకర కాయ, వంకాయ, దొండకాయ, బరబాటి, గోరు చిక్కుడు రూ.60, క్యాప్సికం రూ.100కు విక్రయాలు జరిగాయి.

ఇనాం భూసమస్య పరిష్కారానికి గ్రామసభ 9న

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


ఆర్డీవో జయరాంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నియోజకవర్గ పరిధిలోని గొలుగొండ మండలం కొత్త ఎల్లవరంలో ఇనాం భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 9న గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఇనాం భూముల సమస్యలపై కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కలిసి చర్చించారు. ఇనాం భూములు మొత్తం సర్వే చేయించాలని కోరారు. దశాబ్దాలుగా సాగులో ఉన్న రైతులు హక్కు కోసం పోరాడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాంతో ఎమ్మెల్యే సమావేశమై ఇనాం భూములపై చర్చించారు. సర్వే చేసే ముందు గ్రామ సభ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజాభిప్రాయం మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: ప్రతిభగల గవర, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరంలో పాలిటెక్నిక్, ఐటీఐ, ఈ క్యాట్, ఇంజినీరింగ్, మెడిసన్, బీడీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ తదితర ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించిన వారు తమ కార్యాలయంలో వచ్చే నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

చీడికాడ: మండలంలోని జైతవరంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించనున్నట్లు ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య తెలిపారు. విశాఖకు చెందిన ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య శాల సిబ్బంది పాల్గొని కంటి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా నేత్ర శస్త్రచికిత్సలు చేస్తారన్నారు.

వచ్చే నెలలో గిరిజనులకు దోమతెరల పంపిణీ

రాష్ట్ర మలేరియా విభాగం కన్సల్టేషియన్ రామచంద్రుడు


బిల్లలపాలెంలో దోమల స్ప్రేయింగ్ పరిశీలిస్తున్న రామచంద్రుడు

మాడుగుల రూరల్: దోమల నివారణకు గాను వచ్చే నెల గిరిజన గ్రామాల్లో దోమతెరలు పంపిణీ చేస్తామని రాష్ట్ర మలేరియా విభాగం కన్సల్టేషియన్ ఎస్. రామచంద్రుడు తెలిపారు. మలేరియా ప్రబలే గ్రామాల్లో దోమల నివారణకు సంబంధించి రెండో విడత స్ప్రేయింగ్‌ను సోమవారం సాయంత్రం ఆయన పలు గ్రామాల్లో పరిశీలించారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలోని తాటిపర్తి పంచాయితీ బిళ్లలుపాలెం, గరికబంద, తదితర గిరిజన గ్రామాల్లో ఆయన జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర సారధ్యంలో స్ప్రేయింగ్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో 11 గ్రామాలు, కింతలి పీహెచ్‌సీ పరిధిలో 8 గ్రామాల్లో రెండు విడతలుగా మలేరియా స్ప్రేయింగ్ చేయించామన్నారు. ఏప్రిల్‌లో తొలి విడత, ఈ నెలలో రెండో విడత స్ప్రేయింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, నీటి నిల్వలు లేకుండా ప్రజలు చూసుకోవాలన్నారు. చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి.రమణ, సూపర్‌వైజర్ సురేష్, ఆరోగ్య సహాయకులు నీలాంబరం, ఏఎన్ఎం సువర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటింటా ఓటరు సర్వే


కె.కోటపాడులో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్వో అనిత

కె.కోటపాడు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాన్ని బీఎల్వోలు పూర్తి పారదర్శకంగా చేయాలని మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనిత తెలిపారు. సోమవారం కె.కోటపాడు, కె.సంతపాలెం గ్రామాల్లో ఇంటింటా ఓటరు సర్వే ప్రక్రియను ఆమె పరిశీలించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన వారి నుంచి ఓటుహక్కు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఇతర ప్రాంతాలకు శాశ్వత వలస, వివాహమై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారితోపాటు డబుల్ ఎంట్రీ, మృతుల ఓట్లను వారి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసి తొలగించాలన్నారు. ఇంటింటా ఓటరు సర్వేపై ఎటువంటి ఆక్షేపణలు రాకుండా చూడాలన్నారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు, వీఆర్వో అనంత్ పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు, సభ్యులు

రావికమతం: తన పాటలు, విప్లవ గేయాలతో దళిత, గిరిజనులు, అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిన ప్రజా కవి, గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని కొత్తకోట అంబేడ్కర్, దళిత సంఘాల సభ్యులు అన్నారు. సోమవారం కొత్తకోటలో ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. భౌతికంగా లేకున్నా ఆయన మార్గం అనుసరణీయమన్నారు. నాయకులు మల్లేటి రాజు, బుంగా బుల్లిబాబు, బొల్లల శేఖర్, పూడి అప్పారావు, బి.చిరంజీవి, చెక్కా నాగు పాల్గొన్నారు.

10న సర్పంచ్‌ల ధర్నా

చోడవరం రూరల్: పంచాయతీలను పరిపుష్టం చేయాలన్న ప్రధాన డిమాండ్ సాధనకు ఈ నెల 10న అనకాపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి, ధర్నా కార్యక్రమ నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్ ఈర్లె శ్రీరామ్మూర్తి సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు నెహ్రూ చౌక్‌లో ధర్నా చేపట్టి, అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి సర్పంచ్‌ల సమస్యలపై వినతి పత్రం అందిస్తామన్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టరుకు వినతిని అందజేస్తామన్నారు. పార్టీలకతీతంగా నిర్వహిస్తున్న ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జెడ్పీటీసీ కర్రి సత్యం


మామిడిపల్లిలో పోషణ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సూరినాయుడు


ఏ. కొత్తపల్లిలో పోషణ కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి

దేవరాపల్లి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. సోమవారం మామిడిపల్లిలో సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్‌లతో కలిసి ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు.

ఏ.కొత్తపల్లిలో వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగించుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అశ్రద్ధ చేయొద్దు


విద్యార్థులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి ప్రసన్న


వైద్య పరీక్షలను జరుపుతున్న వైద్యాధికారి నిర్మల

నాతవరం: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. సోమవారం డి.యర్రవరంలో ఫ్యామిలీ డాక్టరు నిర్వహించారు. 72 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కొంతమంది రోగుల ఇంటికి వెళ్లి పరీక్షించారు. ప్రభుత్వ పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులను పరీక్షించారు. వైద్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

89 మంది రోగులకు పరీక్షలు

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరుతో ప్రజల చెంతకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. సోమవారం గొండుపాలెంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి ఏడుగురిని పరీక్షించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం కుమారి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజాను పరామర్శించిన సన్యాసిపాత్రుడు


మంత్రి దాడిశెట్టి రాజాతో మాట్లాడుతున్న సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు మాతృ వియోగం కలిగింది. ఈ మేరకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు తునిలో సోమవారం మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా సానుభూతి తెలియజేశారు.

మణిపూర్ ఘటనపై శాంతియుత ర్యాలీ


మాడుగుల బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డ పాస్టర్లు, తదితరులు

మాడుగుల: మణిపూర్‌లో ఓ వర్గంపై దాడులు నిలుపుదల చేయాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు కాపాడాలని పాస్టర్లతోపాటు క్రైస్తవ విశ్వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి కొంతసేపు శాంతియుతంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ మండలాధ్యక్షుడు కె.అబ్రహం, కార్యదర్శి పి. సురేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.